# వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 298 | మంగళవారం | 11 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## ముఖం చాటేసిన నైరుతి

జూన్ 2వ వారంలో కూడా కానరాని వర్షం

వడ గాలుల, ఉక్కపోతతో జనం సతమతం

8 లో..




# ఉలుకూ పలుకూ లేదు

### డయల్ 100, 101పై జనాగ్రహం

### ఫిర్యాదులు కొండంత.. స్పందన గోరంత

### స్పందించని పోలీసులు

### పరిష్కారం లభించని సమస్యలు

### అయోమయంలో ఫిర్యాదుదారులు

ఆపదలో మీ నేస్తం.. సమస్యల్లో మీకు అండ డయల్ 100 అన్నది ఒకనాటి మాటగా మారింది. నేడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఆపదలో, అత్యవసర పరిస్థితుల్లో మనకు కొండంత అండగా నిలిచే 'డయల్ 100', అగ్ని ప్రమాదం జరిగితే తక్షణమే స్పందించే 101 నంబర్ లు మూగబోయాయి. ఫిర్యాదు చేసినా స్పందించేవారు కరువయ్యారు. తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎంతో ఆశతో ఫోన్ చేసిన వారికి ఎదురు చూపులు తప్పడం లేదు. దీంతో 100, 101పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అత్యవసర నంబర్లకు ఫోన్ చేస్తే అక్కడినుంచి సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం వెళ్లేది. వెంటనే అక్కడి ఉన్నతాధికారులు స్పందించడంతోపాటు స్పాట్ మీదకు పోలీసులు హుటాహుటిన వచ్చేవారు. పోలీసులు చేరుకోవడంతో సగం సమస్యలు అక్కడే పరిష్కారమయ్యేవి. రోజులు మారినట్లే డయల్ 100, 101 నంబర్లకు ఫోన్ చేస్తే స్పందించేవారే కరువయ్యారు. ఫోన్ ఎత్తి సమస్యను తెలుసుకుంటున్న కంట్రోల్ రూమ్ సిబ్బంది ఏరియా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకోవడంతో ఎక్కడి సమస్య అక్కడే అన్న చందంగా మారింది. అత్యవసర నంబర్లకు వచ్చే ఫోన్ కాల్స్ పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని, అందుకే స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పెద్దగా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి.

- వరంగల్ వాయిస్, వరంగల్







వివరాలు 2లో..



8లో..

## నగర శానిటేషన్‌పై తమిళనాడు అధికారుల బృందం అధ్యయనం

మేయర్, కమిషనర్‌తో చెన్నై ప్రతినిధి బృందం భేటీ

నగరంలో అమలుచేస్తున్న విధానాలను వివరించిన మేయర్

బృంద సభ్యులను సత్కరించిన మేయర్

## సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



నల్గొండ-వరంగల్-ఖమ్మం శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న)మంగళవారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపగా విజయం సాధించిన మల్లన్నను రేవంత్ అభినందించారు.

- వరంగల్ వాయిస్, హైదరాబాద్

## రైతు నేస్తాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య



2లో

వరంగల్ వాయిస్ Evening Daily
మంగళవారం 11, జూన్ 2024
www.warangalvoice.net

# ఉలుకూ లేదు.. పలుకూ లేదు



**డయల్ 100, 101పై జనాగ్రహం**

**ఫిర్యాదులు కొండంత.. స్పందన గోరంత**

**స్పందించని పోలీసులు**

**పరిష్కారం లభించని సమస్యలు**

**అయోమయంలో ఫిర్యాదుదారులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అత్యవసరమైనపుడు, కళ్లముందు జరిగే నేరాన్ని అప్పటికప్పుడు నియంత్రించాలని భావించినపుడు పౌరులకు గుర్తొచ్చే సంఖ్య 'డయల్ 100' ఎవరు, ఎక్కడ, ఎప్పుడు ఎలాంటి ఆపదలో ఉన్నా కాపాడుకునేందుకు జనం ఆశ్రయించేది ఈ నెంబర్ నే. కాని నేడు రోజులు మారాయి.. పరిస్థితులు మారాయి..అవసరాలు మారాయి. తదనుగుణంగానే డయల్ 100 కు ఫోన్ చేస్తే స్పందించేవారు కరువయ్యారు. నూటికో..కోటికో ఒకటి..అర సమస్యలను పరిష్కరిస్తూ మిగిలిన వాటిని చెత్తబుట్టపాలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతంలో డయల్ 100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే తప్పకుండా కేసు నమోదు అవుతుందని, తద్వారా బాధితుడికి న్యాయం జరుగుతుందన్న భావన ఉండేది. ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన వారి పేరును సీక్రేట్ గా ఉంచడంతో జనం కూడా వారు నివాసముండే పరిసర ప్రదేశాల్లో జరుగుతున్న సమస్యలను తెలిపేందుకు ముందుకు వచ్చేవారు.
ఇప్పుడు ఫోన్ కాల్స్ కు స్పందించేవారు కరువు కావడంతో చెప్పేవారు కూడా తమకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

## డయల్ 100పై అవగాహన..

గతంలో డయల్ 100పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. విద్యార్థులకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యవసర సమయాల్లో అండగా నిలిచే డయల్ 100 ఆపదలో సంజీవణి లాంటిదంటూ అవగాహన కల్పించేవారు. దీని ప్రాముఖ్యంపై ప్రజలకు తెలిసేలా కార్యక్రమాలను నిర్వహించేవారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, చదువురాని వ్యక్తులు ఆపద సమయంలో పోలీసులను ఎలా ఆశ్రయించాలో తెలియక ఇబ్బందులు పడేవారు. అలాంటి వారికి ఈజీగా ఉండాలన్న లక్ష్యంతోనే డయల్ 100ను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పోలీసులు, ఇతర స్వచ్ఛంద సంస్థలు తీవ్రంగానే కృషి చేశాయి.

## టేకిట్ ఈజీ..

ఇప్పుడు అందరి చేతిల్లోకి స్మార్ట్ ఫోన్ లు వచ్చాయి. దీంతో కళ్లముందు కనిపించే ప్రతి సమస్యను డయల్ 100కు ఫోన్ చేసి చెప్పడం ద్వారా కంట్రోల్ రూమ్ లో ఉండే సిబ్బంది విసిగెతిపోతున్నట్లు సమాచారం. దీంతో పలు సమస్యలను వారు టేకిట్ ఈజీగా తీసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టేకిట్ ఈజీ ఫార్ములాతో కొన్ని అతి ముఖ్యమైన సమస్యలు కూడా కాలగర్భంలో కలిసిపోతున్నట్లు విమర్శలొస్తున్నాయి. పలు ఫోన్ కాల్స్ ను రిసీవ్ చేసుకున్న కంట్రోల్ రూం సిబ్బంది వాటిని ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్ లకు ఫార్వర్డ్ చేసి చేతులు దులుపుకుంటున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

## పర్యవేక్షణ కరువు..

నిత్యం డయల్ 100, 101 లకు వస్తున్న ఫోన్ కాల్స్ ఎన్ని. ఇందులో ఫేక్ కాల్స్ ఎన్ని. నిజంగా సమస్యలతో బాధపడుతున్న వారు ఎంత మంది. డయల్ చేసిన తర్వాత వారి సమస్యకు పరిష్కారం లభించిందా లేదా అన్న పర్యవేక్షణ చేసే వారే కరువయ్యారన్న ఆరోపణలు వినిస్తున్నాయి. అత్యవసర పరిస్థితిలో డయల్ 100కు ఫోన్ చేసినా స్పందన కరువుకావడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఫ్రెడ్లీ పోలీసింగ్ అంటూనే ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపే డయల్ 100, 101ను పోలీస్ ఉన్నతాధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# త్వరలో రేషన్ షాపుల్లో సన్న బియ్యం

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల మంజూరుకు ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో విధి విధానాలు రూపొందించినట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఆయన అన్నారు. మూడు నెలల తర్వాత రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని మంత్రి చెప్పారు. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చే ప్రక్రియ త్వరలోనే ప్రారంభిస్తామని ఉత్తమ్ స్పష్టం చేశారు.

# 13మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

**ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మల్టీ జోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న 13మంది ఇన్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీపీ ఏవీ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో అన్ని శాఖల్లో పెద్ద ఎత్తున బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పోలీస్ శాఖలో బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. మల్టీజోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న 13మంది ఇన్ స్పెక్టర్లను బదిలీ చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

# విద్యుత్ కొనుగోళ్లపై కేసీఆర్‌కు నోటీసు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లపై కేసీఆర్ కు నోటీసులు పంపించారు. చత్తీస్ గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలపై మాజీ సీఎం కేసీఆర్ కు ఈ నోటీసు పంపించారు. విద్యుత్ కొనుగోళ్లపై ఏర్పాటు చేసిన కమిషన్ ముందు హాజరు కావాలని పేర్కొంటూ నోటీస్ జారీ చేయడం జరిగింది.

# మినీ గురుకులంలో దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, మరిపెడ:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకులం (బాలికల) లో 2024- 25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారిణి ఏవీ రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటవ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకు 6 సంవత్సరాల వయసు కలిగిన బాలికలు అర్హులని తెలిపారు. ఒకటవ తరగతిలో 30 సీట్లు, 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు బ్యాక్ లాగ్ ఖాళీలను కూడా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. గురుకులం ఉన్న మరిపెడ మండలానికి చెందిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఎంపికైన విద్యార్థినులకు ఉచిత భోజనం, వసతి, పుస్తకాలు, బెడ్ షీట్స్, దుస్తులు, నోట్ బుక్స్, తదితర అన్ని రకాలైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 10 నుంచి 18 లోపు ఆసక్తి కలిగిన వారు నేరుగా మినీ గురుకులానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఇంచార్జి హెచ్ఎం సెల్ నెంబర్ 9381153893 సంప్రదించాలని కోరారు.

# రైతు నేస్తాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య సూచించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విస్తరణ కార్యకలాపాలు బలోపేతం చేయడానికి, రైతులలో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విస్తృత అవగాహన కల్పించుటకు పలు సూచనలు చేశారు. నర్సంపేట కేంద్రంలోని రైతు వేదిక నుంచి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయాల్ తో కలిసి హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆవిష్కరణలు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి ప్రతి మంగళవారం, శుక్రవారం విస్తరణాధికారులు రైతులతో రైతు నేస్తం పేరిట రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## విత్తన దుకాణాల ఆకస్మిక తనిఖీ ..

నర్సంపేట మండల కేంద్రంలోని పలు విత్తనాలు విక్రయించే డీలర్ షాపులను, ఆగ్రో సెంటర్లను వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయాలతో కలిసి విత్తనాల, యూరియా స్టాక్ రిజిస్టర్ల ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరు నకిలీ విత్తనాలు విక్రయించిన కఠిన చర్యలు తప్పవని, సంబంధిత షాప్ ను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయాల్, ఆర్డీఓ కృష్ణవేణి, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

**నూతన పద్ధతుల్లో పంటల సాగు**

**అందుబాటులో వ్యవసాయ శాఖ అధికారులు**

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, సాగు పద్ధతులను ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలుసుకోవాలని, నూతన పద్ధతుల్లో పంటల సాగు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ రైతలను కోరారు. మంగళవారం హనుమకొండ మండలం పలివేల్పుల గ్రామంలోని రైతు వేదిక నుంచి మాట్లాడుతూ, రైతు నేస్తం కార్యక్రమ ఉద్దేశాలు క్షేత్ర స్థాయిలో రైతుల అనుభవాలను ప్రత్యక్షంగా హాజరైన రైతులను వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు ఇవ్వాలని సూచించారు. రైతు నేస్తం దృశ్య శ్రవణ మాధ్యమంలో హైదరాబాదు నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్ర నగర్ నుంచి శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి సంచాలకులు గోపి, వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి శాస్త్రవేత్తలైన ప్రశాంత్ హాజరయ్యారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో అధిక సాంద్రతలో ప్రత్తి పంట సాగు గూర్చి, శాస్త్రవేత్తలు సలహాలు అందిస్తూ అనుభవజ్ఞులైన రైతులతో నేరుగా ఇతర రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ పద్ధతి ద్వారా ఎకరానికి 50 వేల నుంచి 60 వేల మొక్కలు సాగు చేసినట్లయితే అధికంగా దిగుబడులు సాధించవచ్చున్నారు. సేంద్రియ వ్యవసాయంపై పద్మ శ్రీ, చింతల వెంకట్ రెడ్డి తమ అనుభవాలను రైతులకు నేరుగా వివరిస్తూ చీడ పీడలను తట్టుకొనే పలు రకాల ద్రవణాల గూర్చి వివరించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు దామోదర రెడ్డి మాట్లాడుతూ రైతులు సరైన విత్తనాలను కొనుగులు చేయాలని, అన్ని రకాల విత్తనాలు మార్కెట్లో లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద ఉన్నాయని, విత్తన కొరత లేదని, ప్రత్తి పండించే రైతులు అధిక సాంద్రత పద్ధతుల ద్వారా సాగు చెయ్యాలని అన్నారు. ఈ రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, మండల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో ఐరన్ లెగ్ పాడి కౌశిక్

## పాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేసిన కార్యకర్తలను పక్కన బెట్టి హుజురాబాద్ లో ఆత్మహత్య పేరుతో చావుతప్పి లొట్టపోయినట్టు గెలిచిన కౌశిక్ ను కేసీఆర్ టైగర్ గా సంబోధించడం వల్లనే పార్లమెంట్ లో కొట్లాడి తెచ్చిన బీసీ బిడ్డ పొన్నం ప్రభాకర్ పై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని పాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ దుయ్యబట్టారు. మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ నాడు తెలంగాణ అంటే కేసీఆర్,కేసీఆర్ అంటే తెలంగాణ ఉన్న పార్టీలో కుటుంబ పాలనను వ్యతిరేకించినందుకు ఈటల రాజేందర్ ను గెలవడానికి ఐరన్ లెగ్గు పాడి కౌశిక్ లాంటి ఉద్యమ ద్రోహులను ప్రోత్సహించి, హుజురాబాద్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ పతనానికి బీజం వేసుకున్నారని, జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు సంపాదించి, రాష్ట్ర మంత్రిగా తెలంగాణ ప్రజల మన్ననలు పొందుతున్న పొన్నం ప్రభాకర్ ఎదుగుదలను ఓర్వలేక, అక్కసుతో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ విమర్శలకు దిగడం దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. ఇటువంటి ఐరన్ లెగ్ నాయకుల వల్ల ఇప్పటికే బీసీలకు దూరమై అధికారం కోల్పోయిన కేసీఆర్ స్థాపించిన పార్టీ ఎగ్జిట్ అయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మల్లేశ్వర్ జోస్యం చెప్పారు. గతంలో




రాజకీయ పార్టీల్లో ఐరన్ లెగ్గులను ప్రోత్సహించిన ఆయా పార్టీలు భ్రష్టు పట్టి పోతాయనే దానికి ఆంధ్రప్రదేశ్ ఎన్నికలే ఉదాహరణ అంటూ అభిప్రాయపడ్డారు. 23 సంవత్సరాల అనుభవం గల బీఆర్ఎస్ పార్టీకి టైగర్లు ఎవరు? గోడమీద పిల్లులు ఎవరు? అనేది తెలియనంత కాలం అట్టడుగు వర్గాలు దూరమవడం ఖాయమన్నారు. ఇప్పటికే కేసీఆర్ కోటరీ కారణంగా తెలంగాణ సమాజం ఈసడించుకొని పార్లమెంట్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టిన విషయం గుర్తెరుగుతే మంచిదని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ హితబోధ చేశారు. ఈ సమావేశంలో పాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య, పాస్ రాష్ట్ర నాయకులు బూర విద్యాసాగర్, మెరుగు బాబు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు వంగల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించండి




**వరంగల్ వాయిస్, పరకాల :** మున్సిపాలిటీ ఒకటో వార్డులోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ హాజరై బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, విద్యార్థులు ప్రభుత్వం అందించే వివిధ పథకాలను పొందుకొని చదువులో నైపుణ్యత పెంపొందించుకోవాలని కోరారు. నిపుణులైన ఉపాధ్యాయులు ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, ఇతర మెటీరియల్ వినియోగించుకోవాలని మడికొండ సంపత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చక్రవర్తుల మధు, ఉపాధ్యాయులు దయ్యాల సదయ్య, సరళ, స్వామి, పద్మ, కల్పన, రమ, శారద, నాగరాజు సారంగపాణి, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వేముల శారదకు ప్రముఖుల నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ చిన్నమ్మ వేముల శారద సోమవారం రాత్రి మరణించారు. కాగా, స్వర్గీయ వేముల శారద పార్థివ దేహానికి శ్రీ సత్యసాయి ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, బిల్డర్స్ అసోసియేషన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ అధ్యక్షుడు వేముల సత్యమూర్తి, తెలంగాణ ఆన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఢీంబాయ్ టీవీ సీఈవో వేముల సదానందం నేత, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు పూలమాలలు వేసి ఆమె ప్రవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. దివంగత వేముల శారద మరణం పట్ల వారు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్వర్గీయ వేముల శారద భర్త వేముల మార్కండేయకు, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన మార్నేని రవీందర్ రావు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ గా నియమితులైన మార్నేని రవీందర్ రావు మంగళవారం సెక్రటేరియట్ లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ రవీందర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. సహకార బ్యాంకుల్లో కార్యకలాపాల కంప్యూటరీకరణ, సహకార బ్యాంకుల బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు, అమలుచేస్తున్న సంస్కరణలు, వ్యవసాయరంగానికి సహకార బ్యాంకులు అందిస్తున్న సహకారంపై ఇరువురు చర్చించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు విద్యను అభ్యసించినట్లయితే రాబోవు రోజులలో ఉన్న చదువులు చదివి గౌరవప్రదమైన వృత్తిలో కొనసాగుతారని స్థానిక 40వ డివిజన్ కార్పొరేటర్, శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు మరుపల్ల రవి అన్నారు. మంగళవారం శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్యాల సోమశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం తలపెట్టిన బడి బాట కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్ల రవి పాల్గొని డివిజన్ లోని ఉర్సు, డీకే నగర్ లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు క్వాలిఫైడ్ టీచర్లతో ఆంగ్ల బోధన జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా రుచికరమైన భోజనం ఇస్తారని, పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందజేయబడుతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు. ఈ బడిబాట కార్యక్రమంలో పాలకవర్గ కార్యదర్శి ఏర కోటేశ్వర్ ప్రధానోపాధ్యాయులు చిట్యాల సోమశేఖర్ అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ సొసైటీ ఆధ్వర్యంలో ది.నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హనుమకొండలోని స్వధార్ వసతి గృహం విద్యార్థులకు ఉచితంగా లాంగ్ నోట్ బుక్స్, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఉండే పిల్లలు అంతా పేద, అనాథ పిల్లలు, మహిళలు అని అన్నారు. పేదరికం చదువుకు ఆటంకం కారాదని భావించి నోట్ బుక్స్, స్టేషనరీ వారి చదువుకు సహరించడానికి అందించామని తెలిపారు. అలాగే పిల్లలు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. పిల్లలు క్రమశిక్షణ తో మంచి నడవడికతతో ఒక లక్ష్యం పెట్టుకొని చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకోవాలన్నారు. అప్పుడే మంచి ఉద్యోగాలు వస్తాయని, ఉన్నత స్థానాలు చేరుతారని అన్నారు. అందివచ్చిన అవకాశాలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, శైలజ, విద్యార్దులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి

## ఎఫ్ఎంఎంఎస్ఎస్ కోఆర్డినేటర్ నిరుడు శిరీష




**వరంగల్ వాయిస్, మరిపెడ :** మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలని ఎఫ్ఎంఎంఎస్ఎస్ మండల కోఆర్డినేటర్ నిరుడు శిరీష అన్నారు. మంగళవారం మండలంలోని వీరారం గ్రామంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శిరీష మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, చిన్నపిల్లల కిడ్నాప్ లను గుర్తించి ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని ఆమె వారికి సూచించారు. మహిళలు వివిధ సందర్భాలలో ప్రమాదాల్లో ఉన్నప్పుడు హెల్ప్ లైన్ కోసం 100, 1098, 181, 1930 నెంబర్లకు డయల్ చేయాలని ఆమె తెలిపారు. అంతేగాక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించడం అభినందనీయం, అయితే ఈ సందర్భంలో కొంతమంది మహిళలు ఈ ప్రయాణాన్ని దుర్వినియోగం చేస్తూ మహిళ లోకానికి చెడ్డపేరు తీసుకురావద్దన్నారు. ఉచిత ప్రయాణాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. మహిళలు స్వతంత్రంగా ఆర్థిక స్వాలంబన కోసం పాటుపడాలని బ్యాంకుల నుంచి రుణాలు పొంది, పిల్లల ఉన్నత చదువుల కోసం ఖర్చు చేయాలని, తద్వారా పిల్లలకు మంచి భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఏ.శ్రీవాణి, ఆయమ్మ నాగలక్ష్మి, సుగుణ, దేవి సుగుణ, ఏకమ్మ ,శిరీష ,శైలజ, నాగమణి, నరసమ్మ, భవాని, వెంకట నర్సమ్మ, తదితరులు ఉన్నారు.

# ఆదర్శ కాలనీని సందర్శించిన తమిళనాడు రాష్ట్ర అధికారుల బృందం



**వరంగల్ వాయిస్, నయింనగర్:** నేషనల్ ఎక్స్ పోజర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ నగరంలో అవలంబిస్తున్న పారిశుద్ధ్య పద్ధతులను పరిశీలించడానికి వచ్చిన తమిళనాడు రాష్ట్ర అధికారుల బృందం నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యాన్ని పరిశీలిస్తున్న క్రమంలో 53వ డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీని సోమవారం సందర్శించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసుకోవాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ చేసిన సూచనల మేరకు, ప్రపంచ టాయిలెట్ డే సందర్భంగా మున్సిపాలిటీ, ఆస్కీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాలనీలోని అన్ని ఇండ్లలోని "సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసుకోవడానికి కాలనీ వాసులు ముందుకువచ్చి తమ ఇండ్లలోని సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించుకున్నారు. ఈ కార్యక్రమం అమలును పరిశీలించడానికి వచ్చిన తమిళనాడు రాష్ట్ర అధికారుల బృందం ఆదర్శ కాలనీని సందర్శించి కాలనీలో అమలవుతున్న సెప్టిక్ ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమం అమలులో ఏదురైన సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి చేపట్టిన చర్యలు గురించి ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులతో చర్చించారు. కాలనీలోని పచ్చదనం పరిశుభ్రత, అందమైన వాల్ పెయింటింగ్స్, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ వారికి అందించే విషయాన్ని, స్వచ్ఛ సర్వేక్షన్ లో ప్రజల భాగస్వామ్యాన్ని పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆస్కీ వరంగల్ ప్రతినిధి రాజమోహన్, ఓంప్రకాష్, తమిళనాడు రాష్ట్ర అధికారుల బృందం, కాలనీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కుమారస్వామి, విద్యాసాగర్ రెడ్డి, సంజీవరెడ్డి, పైడిపాల రమేష్, యాదగిరి, అజీమొద్దీన్, రమణయ్య, రజాక్, చంద్రమౌళి, వెంకట్ రెడ్డి, మొండయ్య, గోపాల్, సఫాయి సురక్ష ప్రతినిధులు బండి మణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎమ్మెల్యే రేవూరి సుడిగాలి పర్యటన



**వరంగల్ వాయిస్, పరకాల :** రేపు బుధవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరకాల నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేయనున్నారు. ఉదయం 8-00 గంటలకు-పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో ముంపు ప్రాంతాల సందర్శన నున్నారు. ఉదయం10-15 గంటలకు బడిబాట కార్యక్రమం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పాల్గొంటారు. ఉదయం 11.00 గంటలకు ఆత్మకూరు మండల పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తారు. అనంతరం 12-30 గంటలకు మడికొండలో సత్యసాయి కన్వెన్షన్ హాల్ లో జరగనున్న స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం, వరంగల్ ఎంపీ అభినందన సభకు హాజరవుతారు. సా.4-00 గంటలకు ఖిలా వరంగల్ మండల పరిధిలోని 17వ డివిజన్ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఎమ్మెల్యే నివాసంలో అందజేస్తారని తెలిపారు.

## వినూత్న రీతిలో బడిబాట



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ వినూత్న రీతిలో బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. తన మోటార్ సైకిల్ పై మైక్ ను కట్టుకొని చర్లపల్లి గ్రామంలో వీధి , వీధి తిరుగుతూ, ఇంటింటికి పోయి విద్యార్థులను నమోదు చేసుకోవడం జరిగింది. ప్రభుత్వ పాఠశాల ప్రత్యేకతలను, ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని తెలిపేలా పాటలను తల్లిదండ్రులకు వినిపిస్తూ వారిని ఆకర్షించుకోవడమే కాకుండా విద్యార్థులను నమోదు చేసుకోవడం జరిగింది.

## మల్లికాంబ మనోవికాస కేంద్రంలో పండ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో సీనియర్ జర్నలిస్ట్ దొమ్మాటి శ్రీకాంత్ అనూష దంపతుల కుమార్తె దొమ్మాటి దీపాలి జన్మదిన సందర్భంగా మానసిక దివ్యాంగులకు పండ్లు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ దొమ్మాటి శ్రీకాంత్ మాట్లాడుతూ పిల్లలకు సేవా గుణాన్ని అలవర్చడంలో భాగంగా జన్మదినం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు తమ జీవితంలో జరిగే శుభకార్యాలను అనాధాశ్రమాలలో, వృద్ధాశ్రమాలలో, మనోవికాస కేంద్రాలలో జరుపుకొని వారికి మేమున్నామంటూ భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొమ్మాటి నందిక, శ్రియన్ తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు పరిహారం వచ్చేలా చూస్తా

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** కేటీకే ఓపెన్‌కాస్ట్ గని-3 విస్తరణలో భూములు కోల్పోయిన గణపురం మండలం కొండంపల్లి గ్రామ భూ నిర్వాసితులకు భూ చట్టం ప్రకారం పరిహారాన్ని అందించేలా కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి కలెక్టరేట్ లోని ఐడీఓసీ మీటింగ్ హాల్ లో మంగళవారం సింగరేణి ఓసీ-3 భూసేకరణలో భూములు కోల్పోయిన కొండంపల్లి గ్రామస్తులతో జరిగిన డీఎల్ఎన్ సీ(District Level Negotiation Committee Meeting)లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ వ్యవసాయ భూములకు ధరలకు అనుగుణంగా కొండంపల్లి గ్రామ భూ నిర్వాసితులకు భూ చట్టం ప్రకారం పరిహారం అందేలా చూస్తానని తెలిపారు. ఈ మీటింగ్ లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్, ఎస్వో టు జీఎం కవింద్ర తదితరులు ఉన్నారు.

## కోర్టుకు హాజరైన బీజేపీ నాయకులు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 2018 వ సంవత్సరంలో మతోన్మాది చేతిలో హత్యకు గుర్కెన మట్టెవాడ సాయిబాబా గుడిలోని అయ్యగారు సత్యనారాయణ కుటుంబానికి మద్దతుగా హనుమకొండలో నిరసన కార్యక్రమం చేయగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అకారణంగా హనుమకొండ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. ఆ కేసులో మంగళవారం పీటీసీ కోర్టుకు బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఈ కేసులో భాగంగా తదుపరి విచారణ జూల్కె 30కి వాయిదా పడిందన్నారు. కోర్టుకు హాజరైన వారిలో 30వ డివిజన్ కార్పొరేటర్ రావుల కోమల కిషన్, జడ్ఆర్సీసీ మెంబర్ న్యారమనేని శేషగిరిరావు, హనుమకొండ జిల్లా బీజేపీ జిల్లా కార్యదర్శి బైరి శ్రవణ్ కుమార్, జిల్లా నాయకులు పొనగోటి వెంకట్ రావు, మోత్కూరి రాము, సిరిపురం శ్రవణ్, ప్రవీణ్ ఉన్నారు.

## సాంబిరెడ్డికి బీజేపీ నాయకుల నివాళి



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల నియోజకవర్గం నడికూడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చిలుమల్ల సాంబిరెడ్డి నిన్న సాయంత్రం స్వర్గస్తులయ్యారు. విషయం తెలిసి టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొజ్జం రమేష్, ఒకటో వార్డ్ కౌన్సిలర్ మడికొండ సంపత్, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, వారి భౌతిక దేనికి పూలమాలవేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే, పరకాల నియోజకవర్గ బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పూలమాల వేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల అధ్యక్షుడు గోగుల రాజి రెడ్డి, జయంతి లాల్, తిరుపతి రెడ్డి, రవీందర్ రెడ్డి, వజ్రం, అశోక్, పరకాల రూలర్ ప్రెసిడెంట్ దేవేందర్, ఇంద్రసేనారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా టీచర్ల ప్రమోషన్లు, బదిలీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల కాలంలో ఎన్ సీటీఈ గైడ్ లైన్స్ ప్రకారం టీటీసీ, డీఈడీ చేసిన వారికి పీఎస్ హెచ్ఎం పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వానికి క్లారిటీ ఇచ్చింది. అంతేకాకుండా సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును అనుసరించి టీటీసీ, డీఈడీ చేసిన ఉపాధ్యాయులు మాత్రమే అర్హులని రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో గతంలో ఉన్న మార్గదర్శకాలను ఉన్నతాధికారులు చేసేలా టీటీసీ, డీఈడీ చేసిన వారిని కాకుండా బీఈడీ వారిని కలిపి కూడా రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ లిస్టులు తయారు చేస్తున్నారు. ఈ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రమోషన్లు చేపడితే తాము విద్యా ఉన్నతాధికారులపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తెలంగాణ పీఆర్ టీయూ రావుల కార్ వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు తాము ఫిర్యాదు చేయనున్నట్లు వెంకటేష్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

### బడిబాటలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పిలుపు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** పట్టణంలోని 62వ డివిజన్ సోమిడిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సోమిరెడ్డి అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరుగుతున్నఇంటింటి ప్రచారంలో 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రమా రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ప్రతి విద్యార్థికి ఉచిత పాఠ పుస్తకాలు, రుచికరమైన పౌష్టిక విలువలు కలిగిన మధ్యాహ్నం భోజనం, రాగిజావా, అల్పాహారం అందించబడుతుందన్నారు. కాబట్టి, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లల్ని జాయిన్ చేయించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బల్ల సతీష్ కుమార్, ఉపాధ్యాయులు కె.రాములు, కె.శోభారాణి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పి.హరిత పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ నర్సంపేట మండలంలోని రామవరం ఎంపీపీఎస్, నర్సంపేట ఎంపీపీఎస్, నర్సంపేట ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు గుర్తించి చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రూ.24 కోట్ల వ్యయంతో సుమారు 556 ప్రభుత్వ పాఠశాలలలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా గుర్తించిన ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, అందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని పనులు తుది దశలో ఉన్నాయని, వాటిని పాఠశాలల ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు అందజేయడం జరిగిందని, మహిళా సంఘాలచే కుట్టిన ఏకరూప దుస్తులను పాఠశాల ప్రారంభం రోజున విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి సెక్టోవల్ ఆఫీసర్ సుధీర్ ఎంపీడీవో శ్రీనివాస్ ఎంపీఓ, ఆదర్శ కమిటీ పాల్గొన్నారు.

# లింగారెడ్డి ఆశయాల సాధనకు పోరాడాలి

## బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** సీపీఐ సీనియర్ నాయకుడు, ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ గంగిళ్ల లింగారెడ్డి ఆశయాల సాధనకు నేటి యువతరం పోరాడాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. మంగళవారం ఎల్లాపురంలో లింగారెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ఓదార్చారు. బీకేఎంయూ జాతీయ సమితి సభ్యుడు మోతె లింగారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి రాజయ్య, నాయకులు బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ దోపిడీ పీడన లేని సమసమాజ నిర్మాణంకై కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితుడై సీపీఐలో చేరి గ్రామ, తాలూకా, జిల్లా నాయకుడుగా ఎదిగి క్రమశిక్షణతో అకుంఠిత దీక్షతో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాడన్నారు. జీవితాంతం కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసి ఆదర్శంగా నిలిచారన్నారు. వారి మరణం కార్మిక, కర్షక, శ్రమజీవులకు తీరని లోటన్నారు.

# వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో దివంగత చెరుకూరి రామోజీరావుకు ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామోజీరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు ఆచార్య బానోత్ సురేష్ లాల్, సంస్థ వ్యవస్థాపకుడు మహమ్మద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ రామోజీ రావు మృతి యావత్ దేశానికి తీరని లోటని, ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈనాడు, ఈటీవి సంస్థలు స్థాపించి ప్రజా సమస్యలను ఎత్తి చూపుతూ అటు ప్రభుత్వాలకు, ఇటు ప్రజలకు వారధిగా ఉంటు అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. మీడియా రంగంలో ఆధునికతను జోడిస్తూ విప్లవాత్మక మార్పులు తెచ్చి దేశ ప్రజల మన్ననలు పొందిన ధీశాలి రామోజీరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు శనిగరపు రాజమోహన్, సంస్థ పీఆర్ఓ నిమ్మల శ్రీనివాస్, పొన్నాల రామ్మోహన్, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లకు చేనేతలకు సకల రంగాలలో సమన్యాయం.!



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సమస్త చేనేత కులాల ప్రతినిధులు కోఠి, హైదరాబాదు, బ్యాంక్ స్ట్రీట్ లోని తెలంగాణ దేవాంగ సంక్షేమ సంఘ కార్యాలయంలో ఈ నెల10న సమావేశం జరిగింది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో చేనేత కళాకారుల, చేనేత వర్గ ప్రజల దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలకు నివేదించుట, చేపట్టవలసిన చర్యల గురించి చర్చ చేశారు. ఈ సమావేశంలో బుగుడె రాజా రవిచంద్ర ప్రసాద్ (జాయింట్ సెక్రటరీ ఏఐడబ్ల్యూఎఫ్ టీఎస్), బి.కృష్ణారావు (కోర్ మెంబర్ ఏఐడబ్ల్యూఎఫ్, టీఎస్, రాష్ట్ర ఉన్నతోద్యోగి), రాపోలు జ్ఞానేశ్వర్ (అధ్యక్షుడు హైటెక్ సిటీ పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్, కోర్ మెంబర్ ఏఐడబ్ల్యూఎఫ్ టీఎస్), వనం శాంతి కుమార్ (రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మిక సంఘం, కోర్ మెంబర్ ఏఐడబ్ల్యూఎఫ్ టీఎస్) చోళ రాజేశ్వర్ (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఐడబ్ల్యూఎఫ్ తెలంగాణ, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ కమర్షియల్ టాక్స్) గడ్డం వెంకటేశ్వర్లు (రిటైర్డ్ పీడీ, కో ఆర్డినేటర్ ఏఐడబ్ల్యూఎఫ్ టీఎస్), వడ్డేపల్లి పరమేష్ (రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏఐడబ్ల్యూఎఫ్ టీఎస్ కోర్ మెంబర్) పసలాది సబిత, ఏఐడబ్ల్యూఎఫ్ టీఎస్ కోర్ మెంబర్, రాష్ట్ర ఉన్నత అధికారి), డాక్టర్ బాసబత్తిన రాజేశం (ఛైర్మన్ పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఏఐడబ్ల్యూఎఫ్ టీఎస్ కోర్ మెంబర్), ఏకుల వేణు గోపాలరావు (సీనియర్ బ్యాంక్ మేనేజర్ (రిటైర్డ్), కార్యదర్శి దేవాంగ సంక్షేమ సంఘం), కణికె ఆంజనేయులు (వైస్ ప్రెసిడెంట్- ఏఐడబ్ల్యూఎఫ్ టీఎస్), కణికె విజయలక్ష్మి, చేనేత కవి రాపోలు జగన్ (ఏఐడబ్ల్యూఎఫ్ అధికార ప్రతినిధి) పాల్గొన్నారు.

# బడి బాటను విజయవంతం చేయాలి



## జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ

**వరంగల్ వాయిస్, ములుగు :** బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ విద్య శాఖ అధికారి పణిని, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్ లతో కలిసి జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులతో బడిబాట కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, శక్తి వంచన లేకుండా పనిచేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. గ్రామాలలో బడి మానేసే విద్యార్థి సంఖ్య తగ్గించాలని, బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు రాజు, సాంబయ్య, రమాదేవి, మల్లారెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, దివాకర్, సురేందర్, సాంబయ్య, వెంకటేశ్వర్లు, రాజేష్ జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాధక్క మరణం విప్లవోద్యమానికి తీరని లోటు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రముఖ ప్రతిఘటనోద్యమ, విప్లవోద్యమ నాయకురాలు, కామ్రేడ్ రాధక్క అలియాస్ నిర్మల (86) మంగళవారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లో మరణించారు. ఆమె గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె కుమార్తె ఇంటి వద్ద ఉంటూ వైద్య చికిత్సను పొందుతున్నారు. ఆమె పార్థీవ దేహం సింగరేణి కాలనీలో కుమార్తె ఇంటి వద్ద ఉన్నది. ఆమె అంత్యక్రియలు 13న ఉదయం జరుగుతాయి. ఆరు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమంలో సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ పనిచేశారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో ఆమె ప్రముఖ పాత్ర వహించారు. కడదాకా పీడిత ప్రజల ఉద్యమంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. సుదీర్ఘకాలం అజ్ఞాతవాసంలో గడిపారు. అతివాద మితవాదాలకి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పోరాటం చేశారు. విప్లవోద్యమంలో ఆమె వివిధ బాధ్యతలు వహించారు. ఆమె పైన ఈ ప్రభుత్వం అనేక కుట్ర కేసులు బనాయించింది. సాధారణ కార్యకర్త నుంచి కేంద్ర కమిటీ సభ్యురాలు వరకు విప్లవోద్యమంలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. అటవీ ప్రాంతంలో గిరిజనుల మధ్య పనిచేశారు. దున్నే వానికే భూమి కోసం పనిచేశారు. సుదీర్ఘకాలం అజ్ఞాత జీవితం గడిపారు. విప్లవఉద్యమంలో కొంతకాలం జైలు జీవితం కూడా గడిపారు. కామ్రేడ్ రాధక్క మృతికి సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ తరపున పొలిట్ బ్యూరో సభ్యుడు సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ మన్నవ హరిప్రసాద్ సంతాపం తెలిపారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించను

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయితీ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో మండలాల వారీగా కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలను, కొత్తగా చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు పెండింగ్ లో ఉండడానికి గల కారణాలు ఏంటి....? వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు ఏంటి అనే విషయాలపై అధికారులతో చర్చించారు. అనంతరం నియోజకవర్గంలో ముఖ్యమైన లింక్ రోడ్ల నిర్మాణనికి సంబందించిన ప్రత్తిపాదనలు సిద్ధం చేయాలనీ అధికారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయితీ భవనాలు వెంటనే పూర్తి చేయాలనీ అలాగే సీడిపి నిధుల నుంచి చేపట్టిన పనులను సైతం వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తిసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జాయింట్ కలెక్టర్ పింకేష్ కుమార్, పీఆర్ ఎస్సీ రఘువీర రెడ్డి, హనుమకొండ, జనగామ ఈఈలు వెంకటయ్య, చంద్రశేఖర్, డీఈలు, ఏఈలు, ఇతర పంచాయితీ రాజ్ శాఖ అధికారులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
మంగళవారం 11, జూన్ 2024
www.warangalvoice.net

# వంట కార్మికులకు పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలి

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సారంగపాణి డిమాండ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నా పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజనం వంట కార్మికుల పెండింగ్ మెస్ బిల్లులు పెంచిన వేతనాలు చెల్లించాలని హనుమకొండ జిల్లాలోని వంట కార్మికులు ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కు డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మల రామ్మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వంట కార్మికులకు చెల్లించవలసిన పెండింగ్ మెస్ బిల్లులను అదేవిధంగా పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా వంట కార్మికులకు రూ.10 వేలు వేతనంగా పెంచి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పెంచిన వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వయసు పైబడిన కార్మికులకు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ ల కింద రూ.5 లక్షలు ఇవ్వాలని మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పరాదని వంట కార్మికులందరికీ నాలుగో తరగతి ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారి సమస్యలన్నీ పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు గడ్డం లలిత, వర్కింగ్ ప్రెసిడెంట్ జనుగాని లక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, ఇల్లందుల రాములు, రమా, రజిత, మధ్యాహ్నం భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషన్ పర్యటన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొండా దంపతుల ఆదేశానుసారం వరంగల్ తూర్పు నియోజకవర్గం 28వ డివిజన్ లో వరంగల్ మున్సిపల్ కమిషనర్ పర్యటన లోతట్టు ప్రాంతాలైన సంతోష్ మాత కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, సాయి నగర్ కాలనీలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సందర్శించారు. వర్షాకాలంలో బొంది వాగు సమస్య వలన ప్రతి సంవత్సరం వర్షాలు పడ్డప్పుడల్లా నీళ్లు బాగా రావడం జరుగుతుందని భద్రకాళి ట్యాంక్ బండ్ ఏరియా అధ్యక్షుడు మర్రి రవీందర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నీట మునుగుతున్న సమస్యల పరిష్కారం కోసం రూ.158 కోట్లు కేటాయించడం జరిగింది. అందుకని, దానికి సంబంధించిన పనులను కమిషనర్ సందర్శన చేసి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి'

## ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, మళ్లీ ఎగ్జామ్ నిర్వహించాలని ఆర్టీఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14న రావాల్సిన నీట్ ఈ ఫలితాలను ఎన్నికల రిజల్ట్స్ రోజున హడావిడిగా విడుదల చేశారని ఆరోపించారు. నీట్ లో ఆల్ ఇండియా స్థాయిలో 67 మంది ఫస్ట్ ర్యాంక్ సాధించారని, వారిలో మొత్తం 720 గాను 719, 718 మార్కులు సాధించారని, నీట్ చరిత్రలో ఇలాంటి ఫలితాలు ఎప్పుడు రాలేదన్నారు. అంతేగాకుండా, ఒకే సెంటర్ నుంచి 8 మంది విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులు సాధించారని, ఎగ్జామ్ నిర్వహణలో జరిగిన లోపాలకు ఇదే నిదర్శనమన్నారు. టెక్నికల్ సమస్యల వలన పరీక్షను లేట్ గా నిర్వహించి, నిర్ణీత సమయంలోనే పరీక్ష ముగించారని, దీంతో సమయం కోల్పోయిన విద్యార్థులు కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. హడావిడిగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బాధిత విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలుపుతామని ప్రకటించారని, దీనివలన మెరిట్ స్టూడెంట్స్ తీవ్రంగా నష్టపోయారన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడు తున్న ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)పై సీబీఐ విచారణ జరిపించాలని లేకుంటే ఆర్టీఐ ఇండియా నేతృత్వంలో ఆందోళనలు చేపడుతామని చంటి ముదిరాజ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రాజు, నమీండ్ల హరీష్, సాదబోయిన రాజు, అక్కెల్లి పవన్ కళ్యాణ్, కార్తీక్, ప్రవీణ్, కిరణ్ పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

## ఉద్యోగ సంఘం నేత రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ ఆరోగ్య మిషన్ లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 78 క్యాడర్లలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విభాగాలలో నిత్యం సేవలందిస్తున్న సుమారు 17వేల మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ కౌన్సిల్ మెంబర్ రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 2018 నుంచి 2024 వరకు అల్ క్యాడర్స్ 510 జీవో ప్రకారం వేతనాలు పెంచాలని, ఎన్ హెచ్ఎంలో పని చేస్తున్న ఆయూష్ ఉద్యోగులను సొంతగూటికి చేర్చాలన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయూష్ విలీనం చేసి సాక్షన్ లో పోస్టులు రెగ్యులర్ చేయాలని కోరారు. 17 సంవత్సరాల సర్వీసును వెయిటేజి ఇస్తూ రెగ్యులర్ చేయాల్సిన అసవరం ఉందన్నారు. ఉద్యోగికి, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరిరక్షణ కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా మూలవేతనం చెల్లించాలని కోరారు. ఎన్ హెచ్ఎం అల్ క్యాడర్స్ ఉద్యోగులను రెగ్యులర్ నియామకాలలో వయసుతో నిమిత్తం లేకుండా 80 శాతం వెయిటేజి ద్వారా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న ఖాళీలలో ఎన్ హెచ్ఎం ఉద్యోగులను క్యాడర్ వైస్ గా విలీనం చేయాలన్నారు. ఎన్ హెచ్ఎం. ఉద్యోగి మరణించినట్లయితే వారి కుటుంబంలో ఒకరికి అర్హతను బట్టి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. హర్యానా, మణిపూర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర పలు రాష్ట్రాలు ఎన్.హెచ్ఎం వారిని రెగ్యులర్ చేయడం జరిగింది. పై రాష్ట్రాలను అనుసరించి మన తెలంగాణ రాష్ట్రంలో కూడా 17,000 మంది ఉద్యోగులను రెగ్యులర్ చేస్తే వారి కుటుంబాలకు మేలు చేసినట్లవుతుందని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న విధంగా కనీసం పిల్లలకు మంచి విద్య, వైద్యశాఖలో పనిచేస్తూ మంచి వైద్యం, కనీసం కడుపు నిండ తిండి పెట్టలేని పరిస్థితి ఎన్.హెచ్.ఎం.ఉద్యోగులదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ హెచ్ఎం. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు 180 రోజులు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని, ఎన్ హెచ్ఎం. ఆల్ క్యాడర్స్ ఉద్యోగులకు సంవత్సరానికి 35 క్యాజువల్ లీవ్స్ మంజూరు చేయాలని విన్నవించారు. ఎన్ హెచ్ఎం సెంట్రల్ ఫండ్ 60శాతం రాష్ట్ర వాటా 40 శాతం నడపడం వలన ఒకే క్యారర్ గల వారికి జీవితంలో మాత్రం పెద్ద మొత్తంలో తేడాల ఉండడం అదే రెగ్యులర్ ఉద్యోగులకు జీతం సగానికి పైగా ఎక్కువగా ఉండటం దీంతో ఎన్ హెచ్ఎం అల్ క్యాడర్ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ హెచ్ఎంలో చాలా సంవత్సరాలుగా సేవలందిస్తున్న అల్ క్యాడర్స్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన లేతకారి నల్లగొండ ముఖ్య మంత్రి సహాయ నిధి కింద వారు ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అర్జీ పెట్టుకోగా వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద లేతకరి నల్లగొండకు రూ.27,000 చెక్కు మంజూరు చేయడం జరిగింది. ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కును మంగళవారం బాధితురాలికి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడీ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు హైదర్, యువనాయకులు అరుణ్ అందజేశారు.

# కరపత్రం ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయం శివనగర్ తమ్మెర భవన్ లో ఈనెల 18, 19, 20న యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట లక్ష్మి నర్సింహా స్వామి ఫంక్షన్ హాల్ లో జరుగు రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంఘీ ఎలేందర్, జన్ను రవి శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి సీనియర్ నాయకుడు గుండె బద్రి, దళిత హక్కుల పోరాట సమితి ఖిలా వరంగల్ మండల కార్యదర్శి రాచర్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని పెద్ద తూండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్ రావు పల్లి గ్రామానికి చెందిన బియ్యాని రాములుకి సంబంధించిన ఎద్దు మంగళవారం ఉదయం విద్యుత్ షాక్ తో మరణించింది. మేత కోసం బైటికి వెళ్లిన ఎద్దు గ్రామ సమీపంలోని కంచె లేని ట్రాన్స్ ఫార్మర్ కు తగిలి మృతి చెందిందని, ఎద్దు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు స్పందించి బాధితుడికి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

# టీజీవీఎన్-జాక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి నరేష్



**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ (టీజీవీఎన్-జాక్ ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాకతీయ యూనివర్శిటీ పొలిటికల్ సైన్స్ విభాగానికి చెందిన తాళ్లపల్లి నరేష్ ను నియమిస్తూ తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కోటూరి మానవతారాయ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటూరి మానవతారాయ్ మాట్లాడుతూ 2016 విద్యార్థి నిరుద్యోగ జేఏసీ పాదయాత్రలో కీలక భూమిక పోషించి, విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై ఉద్యమిస్తూ, వాటి పరిష్కారం కోసం అనునిత్యం కృషి చేస్తున్న తాళ్లపల్లి నరేష్ ను తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమకమైన తాళ్లపల్లి నరేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నియామకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్ కోటూరి మానవతారాయ్, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్, పట్ట నాగరాజు, హేమంత్ చౌదరి, దుర్గం వినోద్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## అందాల ఆరబోస్తున్న సుప్రిత

క్యారక్టర్ నటి సురేఖా వాణి కుమార్తె బందారు సుప్రిత సామాజిక మాధ్యమంలో చాలా చురుకుగా ఉంటోంది. బాలీవుడ్ హీరోయిన్లను అనుసరిస్తూ ఫోటోలకు పోజులిచ్చేస్తోంది. తన అందాలను ఆరబోస్తోంది. సుప్రిత సినిమాలు ఏమీ ఇంకా విడుదల కాలేదు కానీ ఆమె పేరు మాత్రం బాగా పాపులర్ అవుతోంది. సామజిక మాధ్యమాల్లో ఆమె పోస్టు చేసే ఫోటోలకి నెటిజన్స్ అప్పుడప్పుడూ ఫిదా అవుతూ వుంటారు, అలాగే వాటిపై కామెంట్స్ కూడా చేస్తూ వుంటారు. ఈమధ్య అద్దం ముందు నిలుచొని కొన్ని ఫోటోలు తీసుకున్న సుప్రిత అవి తన ఇన్స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. వాటిపై నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ నువ్వు అచ్చం జాన్వీ కపూర్ లా వున్నావు అని చెప్పారు ఒకరు. అలంటి జాన్వీ కపూర్‌ని సురేఖా వాణి కుమార్తె సుప్రిత ఫాలో అవుతోంది అన్నట్టుగా కనిపిస్తోంది. ఎందుకంటే జాన్వీ కపూర్ ఎలా అయితే మంచి గ్లామర్ ఫోటోలు పోస్టు చేస్తూ ఉంటుందో సురేఖ వాణి కుమార్తె కూడా అటువంటి ఫోటోలనే పోస్టు చేస్తూ ఉంటుంది. సుప్రిత ఇప్పుడు ఒక సినిమాలో కథానాయకురాలిగా కూడా అరంగేట్రం చేస్తోంది. అయితే ఆ సినిమా ఇంకా చిత్రీకరణ దశలోనే వుంది. సినిమా విడుదలవకముందే తన కేవలం ఫోటోల తోటే సుప్రిత ఇన్స్టాగ్రామ్ లో బాగా పాపులర్ అయిపోయింది అని అంటున్నారు. ఇప్పుడు సుప్రిత ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## వైభవంగా అర్జున్ కూతరు వివాహం

యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య వివాహం సోమవారం సోమవారం చెన్నైలోని అంజనాసుత శ్రీ యోగంజనేయస్వామి మందిరంలో వైభవంగా జరిగింది. కోలీవుడ్ స్టార్ కమెడియన్ తంబి రామయ్య కుమారుడు, నటుడు ఉమాపతితో ఇటీవల ఐశ్వర్య అర్జున్ నిశ్చితార్థం గ్రాండ్‌గా జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు వారి పెళ్లిని కూడా ఇరు కుటుంబ సభ్యులు గ్రాండ్‌గా నిర్వహించారు. ఐశ్వర్య అర్జున్, ఉమాపతిల పెళ్లికి సంబంధించి.. జూన్ 7న హల్దీ కార్యక్రమంతో ఈ పెళ్లి వేడుక మొదలైంది. జూన్ 8 సంగీత్ కార్యక్రమం జరుపుకుని, జూన్ 10న ఉదయం సినీ ప్రముఖుల సమక్షంలో వైభవంగా వివాహమహోత్సవం జరిగింది. కాగా, ఐశ్వర్య అర్జున్, ఉమాపతిల వెడ్డింగ్ రిసెప్షన్ జూన్ 14న చెన్నై లీలా ప్యాలెస్‌లో గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.





## కల్కి ట్రైలర్‌కు భారీగా ఆదరణ

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' జూన్ 27న విడుదల కానుంది. తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రేక్షకుల అంచనాలను రెట్టింపు చేసే ఎలివేషన్స్‌తో పవర్‌ఫుల్‌గా ఉందీ ట్రైలర్. ప్రభాస్ సరసన దీపికా పదుకొణె నటిస్తుండగా.. దిశా పటానీ, అమితాబ్ బచ్చన్ , కమల్ హాసన్ కీలక పాత్రలు పోషిస్తు న్నారు. ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సినిమా ఏదైనా ఉందా అంటే ఠక్కునే చెప్పే పేరు కల్కి 2898 ఏడీ సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా జూన్ 27న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ఏదో ఒక అప్‌డేట్‌తో అభిమానుల్లో జోష్ నింపుతున్నారు మేకర్స్. ఇప్పటకే రిలీజ్ చేసిన బుజ్జి, భైరవ విజువల్స్, ట్రైలర్ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. తాజాగా ఐమాక్స్ వెర్షన్‌లో కూడా సందడి చేసేందుకు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ఐమాక్స్ వెర్షన్ పోస్టర్‌ను షేర్ చేశారు మేకర్స్. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఐమాక్స్ వెర్షన్ ఉండబోతుందని తాజా పోస్టర్‌తో అర్థమవుతోంది.ఈ చిత్రంలో ప్రభాస్ భైరవ పాత్రలో కనిపించనుండగా.. అతడి దోస్త్ బుజ్జిగా స్పెషల్ కారు సందడి చేయనుంది. ఈ చిత్రం నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన కల్కి 2898 ఏడీ టైటిల్, గ్లింప్స్ వీడియో, టీజర్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. ఈ చిత్రంలో బెంగాలీ నటుడు శాశ్వత ఛటర్జీ మెయిన్ విలన్‌గా నటిస్తున్నాడు.




## నా కెరీర్‌లో బెస్ట్ మూవీ

### భారతీయుడు-2లో రోల్‌పై రకుల్



కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'భారతీయుడు 2'. వీళ్లిద్దరి కాంబినేషన్‌లోనే వచ్చిన హిట్ సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా ఇది రానుంది. ఇందులో రకుల్ ప్రీత్ సింగ్ కీలకపాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన పాత్ర గురించి తెలిపారు. 'నా కెరీర్‌లోనే 'ఇండియన్-2' బెస్ట్ సినిమా అవుతుంది. ఇందులో నా పాత్ర అంత గొప్పగా ఉంటుంది. నా నిజ జీవితానికి దగ్గర పోలిక ఉంది. ఎంతో ఆత్మవిశ్వాసం ఉన్న మహిళగా కనిపిస్తాను. ఇప్పటి వరకు ఇలాంటి పాత్రలో నటించలేదు. ఈ సినిమా షూటింగ్ మొత్తం గొప్ప అనుభూతినిచ్చింది. శంకర్ వంటి అగ్ర దర్శకులతో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా విశేషాలను మీతో పంచుకోవాలని చాలా ఆసక్తిగా ఉంది. దానికి ఇంకా సమయం పడుతుంది' అని తెలిపారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా జులై 12న విడుదల కానుంది. 1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చి సంచలనం సృష్టించింది 'భారతీయుడు'. సేనాపతి పాత్రలో కమల్ ఆహార్యం, నటన ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' మరోసారి మ్యాజిక్ చేసేందుకు సిద్ధమైంది. ఇది విడుదలైన వెంటనే మూడో భాగానికి సంబంధించిన నిర్మాణాంతర పనుల్ని మొదలు పెట్టనున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో కమల్ హాసన్‌తో పాటు సిద్దార్థ్, కాజల్ అగర్వాల్, ప్రియా భవానీ శంకర్, ఎస్‌జే సూర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో మనీషా కొయిరాల కూడా కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. శంకర్‌తో ఆమె దిగిన ఫొటో వైరల్ కావడంతో మనీషా కూడా అతిథిపాత్రలో నటించారని టాక్ వినిపిస్తోంది.

# ముఖం చాటేసిన నైరుతి

**జూన్ 2వ వారంలో కూడా కానరాని వర్షం**

**వడ గాలుల, ఉక్కపోతతో జనం సతమతం**



**వరంగల్ వాయిస్, మల్హర్ :** వర్షాకాల సీజన్ ప్రారంభం అయి రెండు వారాలు కావస్తున్న జిల్లాలో నైరుతి రుతుపవనాల జాడ కనిపించడం లేదు. మే 29న కేరళను తాకిన రుతుపవనాలు జూన్ 5 నాటికి తెలంగాణ అంతటా విస్తరిస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసినప్పటికీ వారి అంచనాలకు భిన్నంగా జూన్ రెండవ వారం ముగింపు దశకు చేరుకున్న చుక్క వర్షం లేకపోవడంతో పాటు 40 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండలతో పాటు తీవ్ర ఉక్క పోత ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. దీంతో ఉదయం పది గంటల దాటితే అడుగు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఎండకు ప్రజలు బయటకి రాకపోవడంతో మధ్యాహ్నం వేళల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైతులు పొలం పనులు సైతం చేసుకోవడానికి వీలు పడటం లేదు.

### ఆకాశం వైపు రైతన్న చూపు..

కనీవినీ ఎరుగని రీతిలో ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దానికి తోడు అకాల వర్షాలు, వడ గండ్ల వానలు వరి పంట ను నాశనం చేసి రైతులకు కన్నీళ్ళే మిగిల్చాయి. జూన్ నెలలో రుతుపవనాల రాకతో ఉష్ణోగ్రతలు తగ్గి వర్షాలు కురుస్తాయని దుక్కులు సిద్ధం చేసి వర్షం కోసం ఆశగా ఎదురుచూసిన రైతుల ఆశలు ఇప్పుడు అడియాశలు అయ్యే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనకు భిన్నంగా జూన్ రెండవ వారంలో కూడా ఎండలు మండుతుండటంతో భూ సారం పెంపొందించడం కోసం రైతులు దుక్కి దున్ని జనుము, జీలుగ వంటి పచ్చి రొట్ట విత్తనాలు అలుకగా గత వారం రోజులుగా చుక్క వర్షం కురవక పోవడంతో అవి మొలకెత్త కుండా చెడిపోయాయి. వాగులు, చెరువుల్లో సైతం చుక్క నీరు లేకపోవడంతో మూగ జీవాలు సైతం నీటి కోసం అల్లాడిపోతున్నాయి. ఈ సారి అయిన సకాలంలో వర్షాలు పడి ఖరీఫ్ సీజన్ బాగుంటుందని ఆశించిన రైతులకు ఆదిలోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రానున్న వారం రోజుల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకుంటే ఖరీఫ్ సీజన్ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది.

# నగర శానిటేషన్‌పై తమిళనాడు అధికారుల బృందం అధ్యయనం

**మేయర్, కమిషనర్ తో చెన్నై ప్రతినిధి బృందం భేటీ**

**నగరంలో అమలుచేస్తున్న విధానాలను వివరించిన మేయర్**

**బృంద సభ్యులను సత్కరించిన మేయర్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరంలో అమలు చేస్తున్న శానిటేషన్ విధానాల అధ్యయనానికి తమిళనాడు రాష్ట్రానికి చెందిన మునిసిపల్ అధికారుల బృందం మంగళవారం నగరంలో పర్యటించింది. నగర సందర్శనలో భాగంగా బల్దియా ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ గుండు సుధారాణిని మునిసిపల్ అధికారుల బృందం కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మేయర్ గుండు సుధారాణి గ్రేటర్ వరంగల్ లో అమలు చేస్తున్న అత్యాధునిక శానిటేషన్ పద్ధతులను తెలియజేస్తూ జీడబ్ల్యూఎంసీ నిర్వహిస్తున్న మలశుద్ధి నిర్వహణ (ఎఫ్ ఎస్ టీపీ)ల అధ్యయనంలో భాగంగా అమ్మవారి పేటలో గల కేంద్రాన్ని సందర్శించి ప్లాంట్ ట్రీట్ మెంట్ల సామర్థ్యం ఎంత? నిర్వహణ చేసేవారు, విధి విధానాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని, ఉత్పత్తి అయ్యే సహా అంత్య ఉత్పన్నాలు గురించి వివరించారు. అమ్మవారిపేటలో మరో 150 ఎంఎల్ డీఎఫ్ఎస్ టీపీ త్వరలో వినియోగంలోకి వస్తుందని మేయర్ ఆశాభావం వ్యక్తం చేశారు. బల్దియాలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును బృందం ప్రశంసిస్తు హర్షం వ్యక్తం చేశారు. ఎఫ్ ఎస్ టీపీల నిర్వహణలో స్వయం సహాయక మహిళా బృందాలను భాగస్వామ్యం చేయడం, బంకా బయో వారిచే నిర్వహించే ట్రీట్ మెంట్ విధానం, మండించి మల వ్యర్థాలను మెన్యూర్ (ఎరువు)గా మార్చే ప్రక్రియను, హౌజ్ హెూల్డ్స్ డి-స్లడ్జింగ్ పద్ధతులను వివరిస్తూ ప్రక్రియలో భాగంగా సిబ్బంది, పీపీఈ కిట్ల వినియోగం, మనుషుల ద్వారా కాకుండా యంత్రాల ద్వారా సెప్టిక్ టాంక్ లను శు భ్రపరచడంతో పాటు బల్దియా ప్రయోగాత్మకంగా 53వ డివిజన్ ఆదర్శ కాలనీలో ప్రారంభించిన సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ ప్రక్రియ విధానాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు, సిబ్బంది ఆరోగ్యం పట్ల జీడబ్ల్యూఎంసీ తీసుకుంటున్న చర్యలు మేయర్ వారికి తెలియజేశారు. 14420 టోల్ ఫ్రీ నంబర్ గురించి నగర వాసుల్లో చైతన్యం కలిగించడంతో పాటు ప్రతి మూడోళ్ల ఒకసారి సెప్టిక్ ట్యాంక్ లను క్లీనింగ్ చేయిస్తున్నట్లు మేయర్ తెలిపారు. జీడబ్ల్యూఎంసీ అనుసరిస్తున్న విధానాలను క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసిన అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. నగరం ఒక లెర్నింగ్ ప్లాట్ ఫాం (నేర్చుకుని వేదిక)లా ఉందని కితాబిచ్చారు. అనంతరం తమిళనాడుకు చెందిన మునిసిపల్ అధికారులను మేయర్ శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం తమిళనాడు బృందం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడేను క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ కార్యక్రమంలో బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజేష్, అస్కి ప్రతినిధులు డా.రాజ్ మోహన్ రెడ్డి, ఓం ప్రకాష్, తమిళనాడు మునిసిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మల్ల వలసల వాసనోస్తుంది..

గుండె లోతుల్లోంచి తన్నుకొస్తున్న దుఃఖం..
ఉన్న ఊరినీ, కన్నవాళ్లనూ వదిలి దేశం కానీ దేశానికి
బైలెల్లిపోయి పొట్టకూటి కోసం పోరాటం ఓ వైపు...

గుండెల్లోతుల నుంచి తన్నుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుని...
ముంచుకొస్తున్న బతుకు పోరుకై ఆరాటం మరోవైపు...

తన ఆలనలో ఉండాల్సిన పిల్లలను పుట్టకొకల్ని, గుట్టకొకల్ని
చేస్తున్నానే దిగాలుతో, తనే సర్వస్వంగా బతికే తల్లితండ్రులను, భార్యను
ఏకాకులను చేస్తున్నానే మనాదితో బైలెల్లిపోతున్న
ఒక బతుకు పోరాట వీరుడి కథ ఇది...

భారమైన గుండెతో తన భార్య, పిల్లలను ఆలింగనం చేసుకుని
ఎక్కెక్కి ఏడుస్తున్న ఓ తెలంగాణ బిడ్డ గాథ ఇది...

ఎంతో మందిని కలచివేస్తున్న ఈ సన్నివేశం
సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతున్న సందర్భంగా
మీతో నా అభిప్రాయాన్ని పంచుకుంటున్నాను.

ఒకనాడు ఎనుకబడ్డ ఈ తెలంగాణ తల్లి
తన పిల్లలు బతుకుదెరువుకై దేశాలకేగి పడరాని పాట్లు పడుతుంటే
తల్లడిల్లిపోయింది, కనీసం తన కొడుకు ఎట్లున్నాడో తెలుపే ఆచూకీ
తెల్వక ఆగం ఆగం అయింది.

పరాయి పాలకుల చేతిలో చెరబడ్డ మన తెలంగాణ వలసలకు
పేరుగాంచినది, అట్లాంటి పేరును రూపుమాపి మనోళ్లను మల్ల వాపస్
తెచ్చుకుని తెలివిన పడ్డం. అట్లాంటి మన పల్లెల నుంచి
మల్ల వలసల వాసనోస్తుంది..

భారమైన హృదయంతో దేశాలకు వలస పోయినోళ్లను తలుచుకుని
కన్నోళ్లు, కట్టుకున్నోళ్ళు అనుభవించే మనోవేదన వర్ణనాతీతం..

నునుగు మీసాల వయసు రాకముందే కుటుంబం కోసం నా తమ్ముడు
బైలెల్లి పోతుంటే వాడిని గారాబం చేసే మా అమ్మ ధైర్యం చెప్పుకుంటూ
దాసుకుంటున్న తన కన్నీళ్లు నాకు ఇంకా కనపడుతూనే ఉన్నాయి...

కుటుంబం కోసం దేశం కానీ దేశంలో బిక్కు బిక్కుమంటూ
బతుకుతున్న బతుకు జీవులకు నా సెల్యూట్..



**పిన్నింటి విజయ్ కుమార్**
కాకతీయ విశ్వవిద్యాలయం

# స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారు

**సీడీఎంఏ ఈఎన్ సీలతో సమావేశం**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** బల్దియాకు చెందిన పలు స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారు చేసినట్లు గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. సోమవారం హైదరాబాద్ లో ఇందుకు సంబంధించిన సమావేశం సీడీఎంఏ ఈఎన్సీ ఆధ్వర్యంలో జరిగిందని తెలిపిన కమిషనర్ మాట్లాడుతూ ఈ టెండర్ల ప్రక్రియ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిపోయిన క్రమంలో తిరిగి ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇందులో ఈఎన్సీ చైర్మన్ గా జీడబ్ల్యూ ఎస్ సీసీఎల్ ఎండీ, సీఈఓ, బల్దియా కన్వీనర్ గా సభ్యులుగా సీడీఎంఏ, హనుమకొండ కలెక్టర్ లు సభ్యులుగా వ్యవహరించారని, ఈ సందర్భం గా నిర్వహించిన సమావేశంలో నగరానికి చెందిన రూ.120 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 21 అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారు చేయడం జరిగిందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీఎంఏ దివ్య దేవరాజన్, ఈఎన్సీ జియా ఉద్దీన్, హనుమకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com